**2-73**

## మున్నుడి

ఇది అచ్చతెలుగులో అన్నమాచార్యులవారు చెప్పిన అందాల చందమామ పాట. తెలుగే కదా! తెలికే అనుకొనే తెలివి తక్కువైన వారి తెలివి తెలతెలబోయేట్లు చేసే తెలివైన తెలుగు పాట. చంద్రుడికి తిరుమలయ్యకు చుట్టరికం తెలియని వాళ్లకి యెన్నిసార్లు చదివినా తెలియని కీర్తన "మలయుచు తమలోని మట్టిమానిపంట" అంటే.. ఏమో ఇదమిద్ధంగా తెలియదు. నేను 'బుఱ్ఱ' బద్దలు కొట్టుకొన్నా 'మట్టిమాని పంట' అంటే ఖచ్చితంగా ఏమో అర్థంకాలేదు. నా భావన నేను చెప్పాను. చిత్తగించాల్సింది శ్రీవేంకటేశ్వరుడే. ద్వైతులు, అద్వైతులు అని కొట్టుకొనేవాళ్లం, మనకేదైతే నేమి? కదా!

చం॥
గానకాని నేత్రమై హరికి గూరిమి గూర్చెడి పంట, యీతడున్
మును 'సిరి'తోడబుట్టెనట, మోదకరంబగు పంట జాబిలై,
తనువుల కామరోగమున దగ్ధము జేయును అన్నమయ్యనెన్
అనువుగ వేంకటేశ్వరుని కబ్బిన చల్లని యింటిపంటనెన్
రాగం : రామక్రియ
సందెకాడ బుట్టినట్టి చాయల పంట యెంత-
చందమాయె చూడరమ్మ చందమామ పంట ॥సందెకాడ॥

మునుప పాలవెల్లి మొలచి పండిన పంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గానకాని హరికన్ను గాన చూపుల పంట
వినువీధినెగడిన వెన్నెలల పంట ॥సందెకాడ॥

వలరాజు పంపున వలపు విత్తిన పంట
చలువై పున్నమి నాటి జాజర పంట
కలిమి కామిని తోడ కారుకమ్మిన పంట
మలయుచు తమలోని మట్టిమాని పంట ॥సందెకాడ॥





విరహుల గుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి భాగ్యము పంట
అరుదై తూరుపు కొండ నారగ బండిన పంట
యిరవై శ్రీవేంకటేశనింటిలోని పంట ॥సందెకాడ॥

**భావామృతం :**

ఇదిగో 'చందమామ' చూశారా... ఇది సంధ్య చీకట్లు ముసురుకొంటుంటే 'చాయల పంట' (కాంతులు వెదజల్లే ఫలము) గా పుడుతుంది. ఎంత చందమాయె? (ఎంత అందమైనదో చూడండమ్మా!

ఎంతో పూర్వమే, పాలసముద్రములో పుట్టి పుడుతూనే యువకుడైన (పండిన) ఫలము ఇదియే. దేవతలకు నినుపై (పూర్ణముగా) కనిపిస్తూ ఇష్టమైన ఫలము. శ్రీ మహావిష్ణువునకు ఒక కన్నుగా (ఇంకొక కన్ను సూర్యుడు) ఆయన కొనచూపులతో చూస్తాడు కాబట్టి చల్లగా ఉండే ఫలము ఇదే. ఆకాశవీధిలో వెన్నెలలు వెదజల్లే ఫలము ఈ చందమామ.

ఈ అందాల చందమామ ఘనత నింకా చెప్పాలంటే, ఈయన వలరాజు (మన్మధుడు) కు సహాయకుని వలె ప్రేమ మొలకెత్తిస్తుంటాడు. అందుకే ఈయన వలపుల ఫలము. చల్లని పున్నమి రాత్రులలో వ్యామోహపరచు ఫలము ఈ చందమామ. సిరులమ్మతోడబుట్టిన విశ్వవిఖ్యాతమైన ఫలము. ఉద్యమించి చీకట్లలో మనోజ్ఞముగా వటవృక్షములపై తళుకులీను ఫలము ఈ చందమామ.

ఇక విరహపీడితులకు ఈ చందమామ గుండెమంట. వారి గుండెలకు ఇతని దర్శనమే దుర్భరమైనది. అంత దుస్సహమైన ఫలము ఈ చందమామ. వినువీధిలోని తారా తోరణానికి ఈయన దర్శనమే మహద్భాగ్యమైన ఫలము. అరుదుగా (నెలకొక్కరోజు మాత్రమే) తూర్పుకొండ మీద పూర్ణముగా పండే పంట ఈ జాబిల్లి. (జాబిల్లి అంటే జానుపిల్లి అంటే కుందేలు తనలో వున్నవాడు అంటే చంద్రుడు). చంద్రుడు అనబడే ఈయన స్థిరమైన, శ్రీ వేంకటేశ్వరుని ఇంటిలోని ఫలము, (క్షీరసాగరమధనంలో పుట్టినవన్నీ శివుడు గరళం కంఠంలో నిలిపిన అనంతరం, దక్కినది శ్రీహరికే కదా!) వలె శోభించాడు.